నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 359 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం ● 14, జులై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

మోడల్ స్కూల్ టీచర్లకు అందని జీతాలు

ప్రకటనలకే పరిమితం అయిన జీతాల ప్రకటన

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

హైదరాబాద్,జూలై13 (నమస్తే ఉదయం): ఒకటో తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నమనే మాటలు కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితం అవుతున్నాయని తెలిపారు. మోడల్ స్కూల్ టీచర్లకు గత 7 నెలల నుండి ఏ నెలలో కూడా 1వ తేదీన వేతనాలు చెల్లించకపోవడం కాంగ్రెస్ మోసపూరిత

ఉద్యోగాల కోసం కొట్లాడి..
వాయిదా వేయమంటారా

- యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ
- ఆన్‌టైమ్‌లో ఫీజు రీయింబర్స్ మెంట్
- మీకు ఎలాంటి అనుమానం అక్కర్లేదు
- సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ లాంటి అన్ని రకాల కోర్సులనూ ప్రోత్సహించాలి
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని నడిపించబోతోంది
- జేఎన్టీయూలో క్వాలిటీ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్‌పై ఇంటరాక్షన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- గ్లోబల్ ఏఐ సమ్మిట్ హైదరాబాద్-2024 లోగోను విడుదల చేసిన సీఎం

హైదరాబాద్,జూలై13(నమస్తే ఉదయం): పదేళ్లు ఉద్యోగాల కోసం కొట్లాడిన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే.. రాజకీయ శక్తులు, కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం రెచ్చగొడుతున్నాయని సిఎం రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. ఈ క్రమంలో కొందరు ఆమరణ దీక్షలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పరీక్షలు వాయిదా వేస్తే విద్యార్థులకే తీవ్ర నష్టం జరుగుతుందని వివరించారు. గ్రూప్ వన్‌లో వన ఈస్ట్ వంద చేయాలన్న డిమాండ్‌ను అంగీకరించడానికి అభ్యంతరం లేదని, కానీ ఈ ప్రక్రియ చేపట్టగానే కోర్టు నోటిఫికేషనే కొట్టేస్తుందని అన్నారు. ఇది నిరుద్యోగ యువత గుర్తించాలని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను తీసుకుని రాబోతున్నా మని రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో ప్రతీ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన క్వాలిటీ విద్యపై జరిగిన సదస్సులో ముఖ్య అతిథులుగా సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విద్యపై విద్యాసంస్థల యాజమాన్యాలతో ఇంటరాక్షన్ ఏర్పాటు చేశారు. పుస్తకాల్లో చదువులకు, బయట మార్కెట్ లో సమాజానికి ఏమాత్రం పొంతన లేకుండా ప్రస్తుతం అకాడమిక్ సిలబస్‌లు ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతి ఏటా లక్షల మంది ఇంజనీరింగ్ స్టూడెంట్లు పట్టాలు తీసుకుంటున్నారే తప్ప.. వారిలో పనితనం ఉండట్లేదని ఆయన అన్నారు. అంటే ఏటా లక్షమంది నిరుద్యోగులు వస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాల విద్యార్థులతో పోటీ పడే విధంగా టెక్నికల్ కోర్సులు సిలబస్ మారాలని రేవంత్ రెడ్డి కోరారు. ప్రభుత్వానికి భేషజాలు లేవు,నిరుద్యోగులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణ ఉంటుందని అన్నారు. విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదు అనేదే మా ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రపంచంలో అద్భుతాలు సృష్టించేది ఇంజనీర్లు మాత్రమేనని... సివిల్, మెకానికల్ మిగతా.. 2లో

ఉప ఎన్నికల ఫలితాల్లో బిజెపికి భంగపాటు

- 13 స్థానాల్లో కేవలం 2 స్థానాలకే బిజెపి పరిమితం
- 11 స్థానాల్లో ఇండియా కూటమి అభ్యర్థుల విజయం

న్యూఢిల్లీ,జూలై13(నమస్తే ఉదయం): వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో బిజెపికి భంగపాటు జరిగింది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమికి గట్టి పోటీ ఇచ్చిన ఇండీ కూటమి ఈనెల 10న జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ అదే స్థాయిలో పోటీ ఇచ్చింది. మొత్తం 7 రాష్ట్రాల్లో 13 స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలు వెలువడ్డాయి. ఇండీ కూటమి 10 సీట్లు గెలుచుకుంది. అటు బీజేపీ మాత్రం కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, వెస్ట్ బెంగాల్, బిహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. ఇండీ కూటమిలోని పార్టీలైన కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్,డీఎమ్‌కే, ఆప్ అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో దిగి విజయం సాధించారు. ఇలా బీజేపీకి మరోసారి ఈ కూటమి షాక్ ఇచ్చింది. రాష్ట్రాల వారీగా చూసుకుంటే పంజాబ్‌లోని జలంధర్‌లో మిగతా.. 2లో

కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న వలసలు

- శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన సిఎం రేవంత్ రెడ్డి
- ఎమ్మెల్యేతో పాటు పలువురు కార్పోరేటర్ల చేరిక

హైదరాబాద్,జూలై13(నమస్తే ఉదయం): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ బాట పడుతున్నారు. తెలంగాణలో ఎన్నికల ముగిసిన నాటి నుంచి మొదలైన చేరికలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. గ్రేటర్ ఎమ్మెల్యేలు గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పేసి హస్తం పార్టీలో చేరుతున్నారు. ఇప్పటికే దాదాపు ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా.. ఆ సంఖ్య మరింత పెరుగుతోంది. శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ కండువా కప్పుకోగా.. శనివారం మరో ఎమ్మెల్యే అరికపూడి గాంధీ హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. మిగతా.. 2లో

డీఎస్సీని మూడునెలలు వాయిదా వేయాల్సిందే

- రేవంత్ మమ్మల్ని అవమానిస్తున్నారు
- ఆయనకు తప్పుడు సమాచారం ఇస్తున్నారు
- అశోక్‌నగర్‌లో అర్ధరాత్రి దాటేవరకూ
- నిరుద్యోగుల భారీ ధర్నా

హైదరాబాద్,(నమస్తే ఉదయం): నిరుద్యోగులను అవమానించేలా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతున్నారని నిరుద్యోగులు ధ్వజమెత్తారు. డీఎస్సీని మూడునెలలు వాయిదా వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లో భారీ ధర్నాకు దిగారు. రోడ్డును దిగ్బంధం చేశారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతోందని నిరుద్యోగులు తేల్చిచెప్పారు. ఊహించని ఈ పరిణామాలతో ఖంగుతిన్న పోలీసులు భారీ సంఖ్యలో అశోక్‌నగర్‌లో మోహరించారు. వారికి సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీజేవైఎం, ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు వెనక్కి పంపించారు. వారి ఆందోళన అర్ధరాత్రి దాటేవరకూ కొనసాగుతోంది.

ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ.. మిగతా.. 2లో

సిఎం కార్యక్రమానికి ఆహ్వానించరా?

- ఎంపి ఈటెల రాజేందర్ ఆగ్రహం

హైదరాబాద్,జూలై13(నమస్తే ఉదయం): సిఎం రేవంత్ సమక్షంలోనే ప్రోటకాల్ విస్మరించడం దారుణమని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి జేఎన్టీయూలో పలు భవనాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి తనకు ఆహ్వానం అందలేదంటూ మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కార్యక్రమంలో మిగతా.. 2లో

అద్భుత సదుపాయాలతో చర్లపల్లి రైల్వే స్టేషన్

- ఆధునీకరణతో పూర్తి కావచ్చిన చర్లపల్లి రైల్వే స్టేషన్
- ఫోటోలు షేర్ చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,జూలై13(నమస్తే ఉదయం): చర్లపల్లి రైల్వే స్టేషన్ ఆధునీకరణకు నోచుకుంది. దీంతో ఇక సికింద్రాబాద్‌పై ఒత్తిడి తగ్గనుంది. ఈ క్రమంలో జంట నగరవాసులకు మిగతా.. 2లో

రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య

- ప్రతి జిల్లాకు ఇక ఎసి బస్సు సర్వీసులు
- నల్గొండలో బస్ సర్వీసులు ప్రారంభించిన పొన్నం

నల్గొండ,జూలై13(నమస్తే ఉదయం): రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన బస్సులను ప్రారంభించారు. నల్గొండ-హైదరాబాద్ మధ్య నాన్‌స్టాప్ ఏసీ, 3 డీలక్స్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కొత్తగా 1000 బస్సులు కొన్నామని, మరో 1500 బస్సులకు ఆర్డర్ ఇచ్చినట్లు చెప్పారు. దసరా లోపు నల్గొండ జిల్లాకు 30 ఎక్స్‌ప్రెస్, 30 లగ్జరీ బస్సులు ఇస్తామని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను మిగతా.. 2లో

నగరంలో మరో భారీ మోసం

- ఉద్యోగాల పేరుతో వసూళ్లు
- బోర్డు తిప్పేసిన జాగృతి కన్సల్టెన్సీ

హైదరాబాద్,జూలై13(నమస్తే ఉదయం): హైదరాబాద్ నగరంలో మరో భారీ మోసం బయటపడింది. ఈమధ్య కాలంలో కొందరు దుండగులు నిరుద్యోగుల్ని టార్గెట్ చేసుకొని భారీ మోసాలకు పాల్పడుతున్నారు. మంచి జీతాలిచ్చే పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ శఠగోపం పెడుతున్నారు. వారిని నమ్మించేందుకు.. ఫేక్ కంపెనీలను సైతం సృష్టిస్తున్నారు. తీరా తమ చేతికి డబ్బులందాక.. బోర్డు తిప్పేస్తున్నారు. ఇప్పుడు ఇలాంటి మోసమే తాజాగా హైదరాబాద్‌లో వెలుగు చూసింది. ఉద్యోగాల పేరుతో యువత నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసి, ఓ కన్‌స్టలెన్సీ సంస్థ బోర్డు మిగతా.. 2లో

అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు

- జాతీయ మహిళా కమిషన్ ఫిర్యాదు
- అసభ్యకర పోస్ట్ పెట్టిన అహ్మద్‌పై కేసు నమోదు

న్యూఢిల్లీ,జూలై13(నమస్తే ఉదయం): అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు పెట్టిన ఓ నెటిజన్‌పై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. శనివారం దీనిపై కేసు నమోదైంది. జాతీయ మహిళా కమిషన్ చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. ఆ కామెంట్లు చేసిన నెటిజన్ అకౌంట్ వివరాల కోసం సంబంధిత సోషల్ మీడియా సంస్థను సంప్రదించినట్లు తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మిగతా.. 2లో

ఉద్యోగాల కోసం కొట్లాడి..
వాయిదా వేయమంటారా

(మొదటి పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ కోర్సులను ప్రస్తుతం కాలేజీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సంక్షేమమే ఫస్ట్ ప్రియారిటీగా ఉందని ఆ తర్వాతే అభివృద్ధి అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ ఏఐ సమ్మిట్ హైదరాబాద్ – 2024 లోగోను విడుదల చేశారు.ఇంజనీరింగ్ కాలేజీలు అంటే నిరుద్యోగులను ఉత్పత్తి చేసే ఫాక్టరీలుగా ఉండకూడదని సిఎం సూచించారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ చెల్లించలేదని.. ఈ అకాడమిక్ ఈయర్ నుంచి బకాయిలు లేకుండా ఫీజు రీయింబర్స్ చెల్లిస్తామన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ తీసుకొచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నాడు ఐడిపిఎల్‌ను ఇందిరా గాంధీ పెట్టడం వల్లే నేడు ఫార్మారంగం అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరవాత హైదరాబాద్‌లో ఫార్మా రంగం బాగా అభివృద్ధి చెంది, కోవిడ్ వ్యాక్సిన్ ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగామని అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశానికి అత్యంత అవసరమైంది సివిల్ ఇంజినీరింగ్. కొన్ని కళాశాలల్లో సివిల్ ఇంజినీరింగ్‌ను లేకుండా చేసే విధంగా ప్రణాళికలు చేస్తున్నారు. కళాశాలల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులను కచ్చితంగా నడపాలి. ఈ కోర్సులు లేకపోతే దేశం ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని హెచ్చరించారు. గత సీఎంలు తీసుకున్న విధానాల వల్ల మనం ఐటీ, ఫార్మా రంగాల్లో ముందున్నాం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కోర్సులు ఉండాలి. ఫార్మా, ఐటీ తర్వాత ఏఐ ప్రపంచాన్ని నడిపించబోతోంది. రాష్ట్రంలోని కళాశాలల్లో ఏఐకి సంబంధించిన కోర్సు ప్రవేశపెట్టాలి. ప్రభుత్వం కూడా అందుకు ప్రోత్సహిస్తుంది. త్వరలోనే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి అటానమస్ హోదా ఇస్తాం. ప్రపంచంతోనే పోటీ పడే విధంగా మనం తయారు కావాలి. మా ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోంది. అందుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది' అని సీఎం వివరించారు. 2030 నాటికల్లో ఐటీ రంగంలో కర్ణాటకని అధిగమిస్తామని ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 200 ఎకరాల్లో ఏఐ సిటీని నిర్మిస్తున్నామని ఆయన అన్నారు. మంచి సలహాలు ఇస్తే అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని శ్రీధర్ బాబు విద్యావేత్తలను కోరారు. రాబోయే రోజుల్లో సాఫ్ట్ వేర్ రంగంలో మనమే ముందుంటామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. జేఎన్‌టీయూ వీసీ బుర్రా వెంకటేశం, ఇంజినీరింగ్ కాలేజీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు.

ఉప ఎన్నికల ఫలితాల్లో బిజెపికి భంగపాటు

(మొదటి పేజీ తరువాయి)

గెలవడం ఆప్‌కి చాలా కీలకమైంది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కే ఇది ఓ పరీక్ష లాంటిది. అంత కీలకమైన నియోజకవర్గంలో 23 వేల ఓట్ల మెజార్టీతో ఆప్ అభ్యర్థి విజయం సాధించారు. ఇక పశ్చిమ బెంగాల్‌లో నాలుగు చోట్ల ఎన్నికలు జరగ్గా అన్ని చోట్లా తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. బీజేపీ వెనకబడిపోయింది. తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సతీమణి కమ్లేశ్ ఠాకూర్ విజయం సాధించారు. డెహ్రా నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. మరో చోట కూడా కాంగ్రెస్ గెలిచింది. తమిళనాడులో విక్రవంది నియోజకవర్గంలో డిఎంకె అభ్యర్థి విజయం సాధించారు. ఉత్తరాఖండ్‌లో బద్రినాథ్‌తో పాటు మంగళూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయ పతాకం ఎగరేసింది. ఈ రెండు చోట్లా బీజేపీ వెనకబడింది. అటు బిహార్‌లో జేడీయూ అభ్యర్థి ముందు ఆధిక్యంలో ఉన్నప్పటికీ ఆ తరవాత స్వతంత్ర అభ్యర్థి లీడ్‌లోకి వచ్చారు. ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు కొనసాగింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తరవాత వెలువడుతున్న ఫలితాలు కావడం వల్ల ఉత్కంఠ పెరిగింది. పైగా బీజేపీ గ్రాఫ్ పడిపోయిందన్న వాదనలు వినిపిస్తున్న సమయంలోనే ఇలాంటి ఫలితాలు రావడం మరింత కీలకంగా మారింది. మెజార్టీ స్థానాల్లో ప్రతిపక్ష కూటమి అభ్యర్థులే విజయం సాధించడం ఆ పార్టీలకు మరింత జోష్ ఇచ్చింది.

డీఎస్సీని మూడునెలలు
వాయిదా వేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

తమ వెనుకాల ఏ రాజకీయ పార్టీ లేదని స్పష్టం చేశారు. కావాలని కొందరు సీఎం రేవంత్ రెడ్డికి తప్పుడు సమాచారం అందిస్తు న్నారని పేర్కొన్నారు.
గ్రూప్ –1 మెయిన్స్‌కు 1:100 పిలవాలి. గ్రూప్–2, 3 పోస్టులను పెంచాలి. డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేసి 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

అమరవీరుడి భార్యపై అభ్యంతరకర పోస్టు

(మొదటి పేజీ తరువాయి)

భారత సైనికుడు అంశుమాన్ సింగ్ త్యాగానికి గుర్తుగా భారత ప్రభుత్వం కీర్తి చక్ర అవార్డును ప్రకటించింది. ఇటీవల ఆయన సతీమణి స్మృతిసింగ్ రాష్ట్రపతి చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఆ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో యావత్ భారతదేశం అమరవీరుడి కుటుంబాన్ని కీర్తించింది. అవార్డు స్వీకరించే సమయంలో స్మృతి ముఖం చూసిన దేశ ప్రజల కళ్లూ చెమర్చాయి. కానీ కొందరు మాత్రం ఆ వీడియోపై అభ్యంతరకర కామెంట్లు పెట్టడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దిల్లీకి చెందిన అహ్మద్ అనే వ్యక్తి అసభ్యకరంగా చేసిన కామెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు జాతీయ మహిళా కమిషన్‌ను కోరారు. దీనిపై స్పందించిన మహిళా కమిషన్ ఆ యువకుడి చర్యను తీవ్రంగా ఖండించింది. దిల్లీ పోలీసులు తక్షణమే అతడిని అరెస్టు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 26వ బెటాలియన్ పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన కెప్టెన్ అంశుమాన్ సింగ్ గతేడాది జులై 19న విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. సియాచిన్‌లో వారు ఉంటున్న బేస్ క్యాంప్‌లో సంభవించిన అగ్ని ప్రమాదంలో చిక్కుకొన్న జవాన్లను కెప్టెన్ ధైర్యంగా కాపాడి బయటకు తీసుకొచ్చారు. అగ్నికీలలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తూ తీవ్ర గాయాలపాలై మరణించారు. ఆయన శౌర్యానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం కీర్తిచక్ర అవార్డును అందించింది.

కెయూ వసతి గృహంలో
ఊడిపడ్డ పెచ్చులు

ఆందోళనకు దిగిన విద్యార్థులు

వరంగల్,జూలై13(నమస్తే ఉదయం): వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడిన విషయం మరువక ముందే మరో ఘటన చోటుచేసుకున్నది. వర్సిటీలోని పోతన ఉమెన్స్ హాస్టల్‌లోని ఓ గదిలో అర్ధరాత్రి స్లాబ్ కుప్పకూలింది. అయితే ఆ సమయంలో గదిలో ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే ఈ ఘటనపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. హాస్టల్‌లో ఉండాలంటే ప్రాణాలమీదికి వస్తున్నదని, ఎన్నిసార్లు వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోతున్నదని చెప్పారు. హాస్టల్ వార్డెన్‌ను నిలదీశారు. పైకప్పు ఊడిన ఘటనపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. రాణిరుద్రమదేవి హాస్టల్‌ను పరిశీలించడానికి వచ్చిన రిజిస్ట్రార్ మల్లారెడ్డిని నిలదీశారు. హాస్టళ్లను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయనతో వాగ్వాదానికి దిగారు. రిజిస్ట్రార్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు.కాగా, గత నెల 29న వర్సిటీ క్యాంపస్‌లోని ఉమెన్స్ హాస్టల్‌లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడటంతో పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న లూనావత్ సంధ్య అనే విద్యార్థిని తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఫ్యాన్ మీదపడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. తోటి విద్యార్థులు వెంటనే ఆమెను దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో హాస్టల్‌లోని ఓ గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపడిన ఘటనపై కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కేయూలోని రాణిరుద్రమ హాస్టల్‌ను శనివారం రిజిస్ట్రార్ మల్లారెడ్డి పరిశీలించారు. దీంతో విద్యార్థులు ఆయన్ను అడ్డుకున్నారు. హాస్టళ్లను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కేయూ రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. శుక్రవారం కేయూ వసతిగృహంలోని ఓ గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

తేనెటీగల పెంపకంతో రైతులకు దోహదం

ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ నీరజా ప్రభాకర్

ముగిసిన జిల్లా స్థాయి శాస్త్రీయ తెనెటీగల పెంపకం శిక్షణా కార్యక్రమం

రాజేంద్రనగర్, జూలై13(నమస్తే ఉదయం): రాజేంద్రనగర్‌లోని ఉద్యాన పరిశోధన పరిశోధినా స్థానం ఆధ్వర్యంలో ఆరు రోజుల జరిగిన జిల్లా స్థాయి ,శాస్త్రీయ తెనెటీగల పెంపకం శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది . ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 8వ తేది నుండి 13వ తేది వరకు కొన సాగింది.

ఈ శిక్షణలో అనుభవం గల పలు రంగాలకు చెందిన నిపుణులతో శిక్షణ ఇవ్వడం జరిగింది.

శనివారం చివరి రోజు శ్రీ కొండాలక్ష్మణ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ నీరజా ప్రభాకర్ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న. తెనెటీగల పెంపకం ఆవశ్యకత, శాస్త్రీయ పద్ధతులలో పెంపకం వల్ల జరిగే లాభల గురించి వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమా నికి పలు జిల్లాల నుంచి వచ్చిన వారికి సర్టిఫికెట్లు మంజూరు ప్రధానం చేశారు.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా జరిపించిన ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ అనిత కుమారి, భోదన్, బోధధితర సిబ్బందిని అభినందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన అభ్యర్థులు తీగల పెంపకం చేపట్టాలని, తేనెను, ఇతర ఉప ఉత్పత్తులు ఉత్పత్తి ఉత్పత్తి ప్రయోజనం పొందాలని ఆకాంక్షించారు.

నగరంలో మరో భారీ మోసం

(మొదటి పేజీ తరువాయి)

తిప్పేసింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. జూబ్లీహిల్స్ లో జాగృతి కన్‌స్టలెన్సీ పేరుతో ఓ ఐటీ కంపెనీ ఉంది. ఉద్యోగాలు ఇస్తాం.. ఉద్యోగాలు ఇప్పిస్తాం అంటూ భారీ ఎత్తున డిజిటల్ అండ్ సోషల్ మీడియాలో ప్రచారం చేసింది. నమ్మిన నిరుద్యోగులు కంపెనీకి పోటెత్తారు. ఇక్కడే తన కుట్రను అమలు చేసింది జాగృతి కన్‌స్టలెన్సీ.ఉద్యోగం ఊరికే రాదు.. 2 లక్షల రూపాయల డిపాజిట్ చేయాలని కండీషన్ పెట్టింది. ఐటీ కంపెనీ.. ఐటీ కంపెనీలో ఉద్యోగం కదా అని.. 12 వందల మంది నిరుద్యోగులు.. తలా 2 లక్షల రూపాయలు కట్టారు. 2 లక్షలు కట్టినోళ్లకు ఫేక్ ఆఫర్ లెటర్స్ తో ఉద్యోగాలు ఇచ్చింది.. ఆఫీసుల్లో సీట్లు కూడా ఏర్పాటు చేసింది. కాకపోతే జీతాలు మాత్రమే ఇవ్వలేదు.. మూడు నెలలుగా జీతాలు ఇవ్వక పోవటంతో కంపెనీని నిలదీశారు ఉద్యోగులు. జీతాలు అయినా ఇవ్వండి లేదంటే మేం కట్టిన 2 లక్షల రూపాయలు అయినా తిరిగి ఇవ్వండి అంటూ డిమాండ్ చేశారు. పరిస్థితులు చేయిదాటి పోవటంతో.. రాత్రికి రాత్రి బోర్డు తిప్పేసింది జూబ్లీహిల్స్ లోని జాగృతి కన్‌స్టలెన్సీ. మొత్తం 12 వందల మంది నుంచి 24 కోట్ల రూపాయలను జాగృతి కన్‌స్టలెన్సీ డైరెక్టర్ జగదీశ్ వసూలు చేసినట్లు చెబుతున్నారు బాధిత నిరుద్యోగులు. ఇప్పుడు ఆఫీసుకు తాళాలు వేసి వెళ్లిపోయారని.. కంపెనీ మోసం చేసిందంటూ పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు. కొన్నాళ్ల క్రితం హైదరాబాద్‌లో జాగృతి కన్‌స్టలెన్సీ పేరుతో ఒక ప్రైవేట్ కంపెనీ వెలిసింది. ఈ సంస్థకు ఆకుల జగదీశ్ అనే వ్యక్తి డైరెక్టర్. తమకు రూ.2 లక్షలు చెల్లిస్తే చాలు.. తామే ట్రైనింగ్ ఇప్పించి, మంచి జీతాలు ఇచ్చే సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆ కంపెనీ నమ్మించింది. ఆ ఆఫీస్ చూడ్డానికి ఎంతో అట్రాక్టివ్‌గా ఉండటం, కొందరు ఉద్యోగులు కూడా ఉండటం చూసి.. నిరుద్యోగులు ఎగబడ్డారు. వాళ్లు చెప్పినట్లేగానే రూ.2 లక్షలు ఇచ్చారు. ఇలా మొత్తం 1200 మంది నుంచి రూ.2 లక్షలు చొప్పున.. రూ. 24 కోట్ల వరకూ వసూలు చేసింది. అయితే.. రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోవడం, ఆ సంస్థలో పని చేసే ఉద్యోగులగూ జీతాలు ఇవ్వకపోవడంతో.. అందరూ ప్రశ్నించడం మొదలుపెట్టారు.ఇప్పుడు ఆ కంపెనీ బోర్డు తిప్పేసింది. అందులో పని చేసే ఉద్యోగులతో పాటు డబ్బులిచ్చిన నిరుద్యోగులు ఆ కంపెనీ వద్దకు వెళ్ల చూడగా.. దానికి తాళాలు వేసి ఉన్నాయి.

దీంతో తాము మోసపోయా మని గ్రహించి.. బాధితులు లబోదిబోమంటూ రోదిస్తున్నారు. పోలీసులను ఆశ్రయించి, తమకు న్యాయం చేయాలని కోరారు. దీంతో.. ఈ వ్యవహారంపై అధికారులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న జాగృతి కన్‌స్టలెంట్ డైరెక్టర్ జగదీశ్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదే సమయంలో.. ఇలాంటి మోసపూరిత సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుడ్డిగా డబ్బులు ఇవ్వొద్దని సూచిస్తున్నారు.

అద్భుత సదుపాయాలతో చర్లపల్లి రైల్వే స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో మరో రైల్వేస్టేషన్ అందుబాటులోకి రాబోతోంది. చర్లపల్లి రైల్వే టర్మినల్ ఆధునీకరణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఎన్నికలకు ముందే ప్రారంభం కావాల్సిన ఈ స్టేషన్.. త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. ఈనేపథ్యంలో చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు సంబంధించిన చిత్రాలను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సుమారు రూ.434 కోట్ల బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న ఈ రైల్వేస్టేషన్ తెలంగాణలో నాలుగో అతిపెద్ద రైల్వేస్టేషన్ కాబోతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే 98 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. 9 ఎలాట్‌ఫామ్‌లు కలిగిన ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లలో రద్దీ తగ్గుతుందని పేర్కొన్నారు. సుదూర ప్రాంత రైళ్లు, ఎంఎంటీస్ రైళ్ల మధ్య మారడానికి ఈ స్టేషన్ వీలు కల్పిస్తుందన్నారు. మరోవైపు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నవేళ.. ఈ రైల్వే స్టేషన్‌ను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు
అందని జీతాలు

(మొదటి పేజీ తరువాయి)

వైఖరికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈనెల 13 రోజులు గడిచినప్పటికీ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్స్ జీతాలు అందక అనేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నెల 8వ తేదీన సగం మంది ఉద్యోగులకు మాత్రమే వేతనాలు చెల్లించిన సర్కారు, రంగారెడ్డి, నిజామాబాద్, వనపర్తి, సూర్యపేట, సంగారెడ్డి, సిద్దిపేట, సిరిసిల్ల, పెద్దపల్లి మొత్తం 8 జిల్లాలో పని చేస్తున్న వెయ్యి మందికి పైగా రెగ్యులర్ టీచర్లకు ఇంకా వేతనాలు చెల్లించలేదు. వీరితో పాటు మోడల్ స్కూల్స్‌లో పని చేసే ఔట్ సోర్సింగ్, హవర్లీ బేస్డ్ టీచర్స్ (ఊ÷ు) దాదాపు 2వేల మందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించి ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేసే గెస్ట్ లెక్చరర్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పడం బాధాకరం అని హరీశ్‌రావు అన్నారు. అధికారంలోకి రాగానే రూ. 42 వేల వేతనం చెల్లిస్తామని అభయహస్తం మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ, వారి ఉద్యోగ భవిష్యత్‌ను దెబ్బతీసేలా కేవలం మార్చి 31 నుంచి జులై 31 వరకే కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వడం దుర్మార్గం. ఇందులో ఏప్రిల్, మే నెలల్లో సెలవులే ఉండగా, కేవలం జూన్, జులై నెలకు మాత్రమే పొడిగింపు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ నిర్ణయం వల్ల గత 10 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న1654 మంది గెస్ట్ లెక్చరర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వచ్చింది అని హరీశ్‌రావు తెలిపారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగాలు నిలిపివేస్తే, ఎలా బతికేది అని లెక్చరర్లు, వారి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి విద్యాసంవత్సరానికి పొడిగింపు ఉత్తర్వులు ఇచ్చింది.

కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. గెస్ట్ లెక్చరర్ల వ్యవస్థను ఎత్తేసేందుకు కుట్ర చేస్తున్నట్లు వారు ఆందోళనలో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలి. అభయహస్తం మేనిఫెస్టోలో హామి ఇచ్చినట్లుగా గెస్ట్ లెక్చరర్లకు భరోసా ఇవ్వడంతో పాటు, నెలకు రూ. 42 వేల వేతనం చెల్లించి, విద్యా సంవత్సరం చివరి వరకు ఉద్యోగ కాలాన్ని పొడగించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లోకి
కొనసాగుతున్న వలసలు

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు ఇంతటితో ఆగనట్లు కనిపిస్తోంది. మరికొంత మంది కూడా బీఆర్ఎస్‌ను వీడిన వారి బాటలోనే నడుస్తున్నట్లు తెలుస్తోంది. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో గాంధీ చేరారు. ఉదయం 10 గంటలకు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఎమ్మెల్యే... కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అరికపూడి గాంధీతో పాటు పలువురు కార్పొరేటర్లు, నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ఆదివారంఎమ్మెల్సీ నవీన్ కుమార్ రావు కాంగ్రెస్ గూటికి చేరనున్నారు. అరికెపూడి గాంధీ కాంగ్రెస్‌లో చేరగా, సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు అనుచరులు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో హస్తం పార్టీలో చేరిన భారాస ఎమ్మెల్యేల సంఖ్య 9కి చేరింది. ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఖైరతాబాద్ శాసనసభ్యుడు దానం నాగేందర్, భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. అరికెపూడి గాంధీతో పాటు పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత వలసలతో హస్తం పార్టీ దూకుడు పెంచింది. ఓ వైపు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల చేరికలతో శాసనసభ, మండలిలో తన బలాన్ని పెంచుకుంటున్న కాంగ్రెస్ అటు జీహెచ్ఎంసీ కౌన్సిల్ లోనూ కార్పొరేటర్లను చేర్చుకుని నగరంపై పట్టు సాధించాలని చూస్తోంది. ఈ క్రమంలోనే పలువురు కార్పొరేటర్లను కాంగ్రెస్ లో చేర్చుకుంటుంది. దీంతో జీహెచ్ఎంసీ కౌన్సిల్ లో బీఆర్ఎస్ కార్పొటర్ల సంఖ్య 56 నుంచి 41 కి చేరింది. జీహెచ్ఎంసీ కౌన్సిల్ లో ప్రస్తుతం కాంగ్రెస్ కార్పొరేటర్లు సంఖ్య 3 నుంచి 25 కు చేరింది. బీజేపీ కార్పొరేటర్ల సంఖ్య 39కి చేరింది.

సిఎం కార్యక్రమానికి
ఆహ్వానించరా?

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక ఎంపీ అయిన తనకు ఆహ్వానం పంపకుండా అధికారులు ప్రోటోకాల్ విస్మరించారని మండిపడ్డారు. దీనిపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఉద్దేశ్య పూర్వకంగానే తనను పిలవకుండా అవమానిచారంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. అధికారులకు ప్రివిలేజ్ నోటీసులు ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరనున్నట్లు ఎంపీ స్పష్టం చేశారు. కనీసం శిలాఫలకంలో అయినా తన పేరు ఉందో లేదోనంటూ ఎంపీ ఈటల రాజేందర్ ఆరా తీస్తున్నారు.

రద్దీకి అనుగుణంగా
బస్సుల సంఖ్య

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం డీఏ ఇచ్చామన్నారు. రూ.280 కోట్ల బకాయిల్లో రూ.80 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. మిగిలిన రూ.200 కోట్లను నెలాఖరులోగా

చెల్లిస్తామని తెలిపారు. ఆర్టీసీలో 3,035 ఉద్యోగ నియామకాలు చేపట్టామన్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రం నుంచి లగ్జరీ బస్సులు నడుపుతామన్నారు. అన్ని జిల్లా కేంద్రాల నుంచి ఏసీ బస్సులు ప్రారంభిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. త్వరలో నల్గొండ జిల్లాకు మరిన్ని బస్సులు తెస్తామన్నారు. కొత్త బస్సుల్లో నల్గొండకు 100 కేటాయించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జహంగీర్ ఖాన్

శంషాబాద్,జూలై 13 (నమస్తే ఉదయం): శంషాబాద్ మున్సిపాలిటీ కౌన్సిలర్, మైనార్టీ నాయకుడు మహమ్మద్ జహం గీర్ ఖాన్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎను ముల రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం రేవంత్ రెడ్డి నివాసంలో ఆయన కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శంషాబాద్ పుర పాలక సంఘం పరిధిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా బలపరుస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని జహంగీర్ ఖాన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరే విధంగా చొరవ తీసుకొని పార్టీని బలోపేతం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు గణేష్ గుప్తా. మున్సిపల్ చైర్ పర్సన్ కొలను సుష్మా మహేందర్ రెడ్డి. మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు దూడల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథ యాత్ర

రాజేంద్రనగర్, జూలై13(నమస్తే ఉదయం): అత్తాపూర్ ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో శనివారం జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించారు. ఇస్కాన్ దేవాలయ జనరల్ మేనేజర్ సచితానందన్ హరిదాస్ , దేవాలయ ప్రతినిధి మధుర కన్నయ్య దాస్ ల నేతృత్వంలో ఈ యాత్ర కొనసాగింది.

అత్తాపూర్‌లో నిర్వహించిన జగన్నాథ రథయాత్ర

మధ్యాహ్నం రెండు గంటలకు దేవాలయ ప్రాంగణం నుండి రథయాత్ర ప్రారంభమయి తేజస్వినీ నగర్ నుండి పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్ వే 175 వద్ద గల ఎస్ బీ ఆర్ గార్డెన్ వరకు కొనసాగింది. ఈ రథయాత్రలో పదివేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఎస్ బి ఆర్ గార్డెన్‌లో సాయంత్రం 6 గంటల నుండి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరయిన వారందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ రథయాత్రకు ఇస్కాన్ దేవాలయాల ముఖ్య స్వాములు సీతారామదాసు, వేదాంత, చైతన్యదాసు, ప్రదేశం దాస్, వరద కృష్ణ దాస్, చైతన్య అవతార్ దాస్ లు హాజరయ్యారు. రథాన్ని లాగడం ద్వారా మోక్షం లభిస్తుందని తెలిపారు. రథయాత్ర సందర్భంగా భారీ ఏర్పాట్లు చేపట్టారు.

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా
శివసేన రెడ్డి నియామకం...

శుభాకాంక్షలు తెలిపిన జిట్టా సునీల్ కుమార్ యాదవ్...

కూకట్‌పల్లి, జూలై 13 (నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా గచ్చిబౌలి స్టేడియంలో పదవి బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కె శివ సేనా రెడ్డిని తెలిపిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు, కూకట్ పల్లి యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ జిట్టా సునీల్ కుమార్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఎన్ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి రాహుల్ సింగ్ చౌహాన్, భాస్కర్, గిరి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

షాప్ చైర్మన్ శివసేనారెడ్డికి పుష్పగుచ్చం చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సన్మానించిన మాజీ కౌన్సిలర్ కేఎస్ దయానంద్

రాజేంద్రనగర్, జూలై13(నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మాజీ కౌన్సిలర్ కేఎస్ దయానంద ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్, పంబల రాజు, రమేష్ ,ఉదయ్ కిరణ్, హరిచంద్ర ప్రసాద్, కెన్ని తదితరులు పాల్గొన్నారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో
30 వసంతాలు పూర్తి చేసుకున్న టైక్వాండో కరాటే క్రీడ

వేల సంఖ్యలో విద్యార్థులను తీర్చిదిద్దిన మాస్టర్‌గా అత్యున్నత ప్రతిభను పొందిన మాస్టర్‌గా కరాటే శ్రీహరి

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 13(నమస్తే ఉదయం): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో టైక్వాండో కరాటే క్రీడ 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనంలో పట్టణానికి చెందిన పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులతో పాటు క్రీడాకారులు, క్రీడాకారుల తల్లిదండ్రులతోపాటు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, ఎంతోమంది విద్యార్థులను తీర్చి దిద్దిన టైక్వాండో కరాటే మాస్టర్ కే.శ్రీహరి దంపతులకు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పలువురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పాటు జిల్లాలోని వివిధ మండలాల్లో టైక్వాండో కరెక్టే విద్యార్థులను తయారుచేసిన మాస్టర్ శ్రీహరి సేవలను కొనియాడారు.

ముఖ్యంగా తైక్వాండో కరాటే క్రీడలను నేర్చుకోవడం వల్ల కలిగే లాభాలను మరియు సర్టిఫికెట్ల ద్వారా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు పొందే అంశాన్ని గురించి ప్రధానంగా తెలియజేశారు, అనంతరం 30 సంవత్స రాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమన్ని నిర్వహించారు.

38వ సబ్ జూనియర్ 7వ క్యడేట్, 41వ జూనియర్,40వ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ తైక్వాండో కరాటే పోటీలను ముఖ్య అతిథుల సమక్షంలో ప్రారంభించారు, ఈ ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీలలో బంగారు పతకాల సాధించిన వారు జూలై 19, 20, 21వ తేదీలలో మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని జోగులాంబ గద్వాల జిల్లా తైక్వాండో కరాటే అసోసియేషన్ ప్రతినిధులు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో టైక్వాండో కరాటే సీనియర్ కోచ్‌లు మరియు క్రీడాకారులు, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అదేవిధంగా గత నెలలో బ్లాక్ బెల్ట్ సాధించిన క్రీడాకారులకు కూడా అభినందనలు తెలియజేశారు,

జిల్లాస్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో కూడా పథకాలు సాధించి జాతీయస్థాయి లో కూడా మంచి ప్రతిభను కనబరిచి జిల్లాకి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో టైక్వాండో కరాటే రాష్ట్ర అధ్యక్షులు ముఠా శ్రీనివాస్, ఆనంద్, కృష్ణ, త్యాగరాజు, నారాయణ గౌడ్, బాబు నాయుడు తదితరులు ఉన్నారు,

పేదల భూములు లాక్కొని రెగ్యులరైజ్ చేసుకోవటానికి కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చేరిక: తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజకీయ వ్యభిచారి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

ఎమ్మెల్యే స్వప్రయోజనాల కోసమే పార్టీ మార్పు

ప్రజాభివృద్ధి పట్టని ఎమ్మెల్యే ...

భూ దందాల కోసం పార్టీ మార్పు

ప్రజా సమస్యలకు పంగనామం

పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ కంటెస్టెడ్ బిజెపి అభ్యర్థి, కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి

రాజేంద్రనగర్, జూలై13(నమస్తే ఉదయం): ప్రజా సమస్యలను వంచించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేదల నుండి లాక్కున్న భూములను రెగ్యులరైజ్ చేసుకోవటానికి కాంగ్రెస్ పార్టీలో చేరారని రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెడ్ బిజెపి అభ్యర్థి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు.శనివారం కాటేదాన్ లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి దళిత మోర్చా రాష్ట్ర నాయకులు జోగి రవి, డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికే జనార్ద న్ , పార్టీ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి, సి బుచ్చిరెడ్డి లతో కలిసి ఆయన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రసంగిస్తూ...

రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సొంత ప్రయోజనాలు, ఆస్తులను కాపాడుకునేందుకు పార్టీలు మారుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అంటూ అధికార పార్టీలోకి చేరడం ఎమ్మెల్యేకు పరిపాటిగా మారిందన్నారు. రాజకీయ బిక్షం పెట్టిన టిడిపి, భూదందాలకు సహకరించిన బిఆర్ఎస్ ను మోసం చేశారని విమర్శించారు. టిడిపి నుండి టిఆర్ఎస్ లో చేరిన ప్రకాష్ గౌడ్ అభివృద్ధి కోసం నాడు పార్టీ మారానని చెప్పి 8 ఏళ్లు అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగిన ప్రకాష్ గౌడ్ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. గండిపేట మండలంలో మంచినీటి దాహర్తిని తీర్చేందుకు టిడిపి నుంచి టిఆర్ఎస్ లో చేరిన ఎమ్మెల్యే ఆ దిశగా ఏనాడు కూడ పనిచేయలేదన్నారు. ఇప్పటివరకు గండిపేట్ మండలానికి మంచినీరు తీసుకురాలేకపోయారన్నారు. ఇప్పుడు శంషాబాద్ మండలంలో రైతాంగ సమస్యలను పరిష్కరించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలపడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

శంషాబాద్ మండలంలో చిన్న గోల్కొండ సర్వే నెంబర్ 24లో 200 ఎకరాలు, పెద్ద గోల్కొండ సర్వేనెంబర్ 114 నుంచి 176 వరకు 185 ఎకరాలు అసైన్డ్ ల్యాండ్ ను రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారని ఆరోపించారు. అలాగే శంషాబాద్‌లో హెచ్ఎండిఏ స్థలం 50 ఎకరాల భూమి ని కబ్జా చేశారని తెలిపారు. ఎయిర్ పోర్టు కాలనీలో 13 ఎకరాల భూమిని కబ్జా చేశారన్నారు. ప్రకాష్ గౌడ్ కబ్జా చేసిన, తక్కువ ధరకు కొనుగోలు అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసుకోవడానికి అధికార పార్టీలో చేరారని తెలిపారు.

నియోజకవర్గన్ని అభివృద్ధి చేసే చేతగాక , నిధులు తేలేక కాలయాపన చేశారన్నారు. ఒకవేళ నిధులు వచ్చిన ఆ నిధులను పూర్తిగా సద్వినియోగం చేసుకోలేని అసమర్ధ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అని మండిపడ్డారు.

కష్టపడి పనిచేసిన పాత కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రకాష్ గౌడ్ సరైన న్యాయం చేస్తారా అని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నించారు. ప్రకాష్ గౌడ్ వద్ద భూ కబ్జాలు, భూమాఫియాలు చేసే నాయకులే అభివృద్ధి చెందుతారు తప్ప నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగదన్నారు. ప్రకాష్ గౌడ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ పార్టీ అధ్యక్షుడు అడికె జనార్దన్, జోగి రవి, శీలం తిరుపతిరెడ్డి, నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి, శివ, శ్రీకాంత్ రెడ్డి, రామ కృష్ణ, వెంకటరెడ్డి, శివశంకర్, రాజ్ కుమార్, గోపాల్ నాయక్, శంకర్ రెడ్డి, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో
కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలు, కార్యకర్తల అభీష్టం మేరకే కాంగ్రెస్ పార్టీలో చేరా...

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ...

కూకట్‌పల్లి, జూలై 13 (నమస్తే ఉదయం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రభుత్వ సలహాదారుడు వేమునరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డిగార్ల సమక్షంలో శేర్లింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, శ్రీమతి మంజుల రఘునాథ్ రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు మొవ్వా సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రావు, మోహన్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు శనివారం కాంగ్రెస్ పార్టీతీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి బాసటగా నిలవలన్నదే తన లక్ష్యం అని, శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది అని, నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయం అని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయభి లాషుల అభిష్టం మేరకు మరియు వారి సూచనల మెరకు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నానని అని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు.

ఏడు నెలలుగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటపడింది అని, కాంగ్రెస్ పార్టీలో చేరితే అభివృద్ధి చెందుతుంది అని తెలియచేసారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మౌలిక వసతులకు పెద్ద పీట వేయాలని, సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులకు, చెరువుల సుందరికరణకు, పార్కుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, పెండింగ్ పనులు త్వరిత గతిన పూర్తియ్యేలా చూడలని, పెండింగ్ ఫ్లై ఓవర్‌ల నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడలని అదేవిధంగా మియాపూర్ నుండి బీహెచ్ ఈఎల్ వరకు ట్రాఫిక్ నివారించడానికిగాను ఒకే పిల్లర్ మీద మెట్రో మరియు ఫ్లై ఓవర్ నిర్మాణం పనులు త్వరితగతిన చేపట్టేలా చూడలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా దీనికి సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, త్వరలోనే పనులు జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పోరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయభిలాషులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డితో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి

విద్యార్థుల సమస్యలపై లేదా ?: గాడిల నవీన్

నిరుద్యోగుల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలి.

నిరుద్యోగులపై లాఠీచార్జి జరిపిన సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి...

బిఆర్ఎస్ విద్యార్థి నాయకులు గాడిల నవీన్...

కొత్తకోట, జూలై 13(నమస్తే ఉదయం):
సీఎం రేవంత్ రెడ్డికి పార్టీ ఫిరాయింపుల పై ఉన్నా దృష్టి విద్యార్థుల సమస్యలపై లేదా అని బిఆర్ఎస్ విద్యార్థి నాయకుడు గాడిల నవీన్ ప్రశ్నించారు. శనివారం కొత్తకోట పట్టనకేంద్రంలోని నిరుద్యోగుల సమావేశంలో విద్యార్థి నాయకులు గాడిల నవీన్ మాట్లాడుతూ... మోసపూరిత కాంగ్రెస్ ఎన్నికల ముందు నిరుద్యోగులను రెచ్చగొట్టి ప్రభుత్వంలోకి వచ్చిందని రేవంత్ రెడ్డి నిరుద్యోగులపై ఉక్కు పాదం మోపడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు.తక్షణమే నిరుద్యోగులకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు.

ఏమైంది మెగా డీఎస్సీ?
ఏమైంది జాబ్ కాల్ క్యాలెండర్?
ఎక్కడ నిరుద్యోగ భృతి?
ఎక్కడ ప్రతి విద్యార్థికి ఐదు లక్షల భరోసా కార్డు?
ఎక్కడ గ్రూపు-1,2,3 లలో పెంచిన పోస్టులు?

నిరుద్యోగుల హక్కులను కాలరాస్తూ నిరుద్యోగులపై లాఠీచార్జి చేయడం మోసపూరిత ప్రభుత్వానికి నిదర్శనం అన్నారు.

శాంతియుతంగా తమ డిమాండ్లు నెరవేర్చాలని నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేస్తుంటే ఉస్మానియా యూనివర్సిటీలో లాఠీ చార్జి జరిపి విద్యార్థులను తీవ్రంగా గాయపరచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఇదేనా ప్రజా పాలననా? ఎక్కడ గ్యారంటీలు? ఎక్కడ చేయూత? ఎక్కడ మహాలక్ష్మి? ఎక్కడ ఇందిరమ్మ ఇండ్లు? ఎక్కడ యువవికాసం? ఎక్కడ గృహజ్యోతి? ఎక్కడ రైతు భరోసా?ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా గాలికి వదిలేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ ఢిల్లీ చుట్టూ ఇప్పటికే 17 సార్లు చక్కర్లు కొట్టడం యావత్ తెలంగాణ రాష్ట్రం చీదరించుకుంటుందన్నారు. రేవంత్ రెడ్డి ఖబడ్దార్ తక్షణమే నిరుద్యోగులు అడుగుతున్న న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే కచ్చితంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్తారని ఆయన విమర్శించారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్‌తో

గద్వాల జిల్లా నేతలు భేటీ

గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 13(నమస్తే ఉదయం):
దశాబ్దాలుగా దోపిడీకి గురైన అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిందే గులాబీ జెండా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్ చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి కేటిఆర్‌తో ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ (సాట్స్)మాజీ ఛైర్మన్ ఆంజనేయ గౌడ్, గద్వాల జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు, తదితరులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత గద్వాల నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు. అనంతరం కేటిఆర్ మాట్లాడుతూ కష్టకాలంల్లో పార్టీకి అండగా ఉన్నా వారిని ఎవరిని బీఆర్ఎస్ పార్టీ మరువబోదని రానున్న ఎన్నికల్లో బీసిలకీ అవకాశం ఇస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్తు మనదేనని, నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలకు నాయకులకు అండగా నిలవాలని బాసు హనుమంతు నాయుడుకు కేటీఆర్ సూచించారు. త్వరలో గద్వాల్ నియోజకవర్గానికి వచ్చి,కార్యకర్తలు అందరిని కలుస్తానని కేటీఆర్ హామీ ఇచ్చినట్లు బాసు హనుమంతు నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్వ విజయ్ కుమార్, మోనేష్ మారోజు, తిరుమల్, నూర్ ఫాష,బాసు గోపాల్, ఎల్లందొడ్డి రాజు నాయుడు, రాజగోపాల్, బి.నాయుడు, బాసు గోపాల్, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్చం అందజే స్తున్న పార్టీ నాయకులు



కొత్తకోట మాజీ సర్పంచ్ బాలస్వామి పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే జిఎం ఆర్ , ధన్వాడ బాలస్వామి (ఫైల్ ఫోటో), బాలస్వామి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి

కొత్తకోట మాజీ సర్పంచ్ ధన్వాడ బాలస్వామి అనారోగ్యంతో మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే జిఎంఆర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొత్తకోట, జూలై 13(నమస్తే ఉదయం):
కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కొత్తకోట మాజీ సర్పంచ్ ధన్వాడ బాలస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జీఎంఆర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలస్వామి పార్థివ దేహానికి నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం కొత్తకోట లో సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త గొల్ల గండన్న కుమారుడు నిరంజన్ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి భౌతిక దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎమ్మెల్యే జియంఆర్ ఆర్థిక సహాయం అందజేశారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ సి డి సి చైర్మన్, రామకృష్ణాపురం పిఎసిఎస్ మాజీ చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను ఆయన నివాసంలో కలసి సన్మానిస్తున్న రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుద్దాం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను కలిసిన రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు

రాజేంద్రనగర్, జూలై13(నమస్తే ఉదయం):
కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌ను శనివారం మైలార్ దేవ్‌పల్లిలోని ఆయన నివాసంలో రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు పలుగుచెరువు మహేష్‌ల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని కలుపుకొని అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు. కార్పొరేషన్ ఎన్నికలలో విజయం సాధించడానికీ కలిసి పనిచేయాలన్నారు. ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీనియర్ నాయకులు అనుముల జాన్ పాల్, ఉప్పర్‌పల్లి గ్రామ అధ్యక్షులు సాయి ముదిరాజ్, బుద్వేల్ గ్రామ అధ్యక్షులు కోరని శ్యామ్, శివరాంపల్లి అధ్యక్షులు పవన్ యాదవ్, ఎర్రబోడ అధ్యక్షులు భారత్ రెడ్డి, సిరాజ్, రెబల్ సాయి, మహేందర్, విశాల్, సురేష్, ప్రశాంత్, కిషోర్, సాయి, శ్రీకాంత్ రెడ్డి, కిట్టు, శ్రీనివాస్ రెడ్డి , ఇటికాల రాజు, శాంతి కుమార్, రమేష్, నరేందర్, మహేందర్, యువనాయకులు పాల్గొన్నారు

పార్టీ శ్రేణులకు

అండగా అధిష్టానం..

కలిసికట్టుగా ముందుకు సాగి టిఆర్ఎస్‌ను నిలబెట్టుకుందాం.

మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్

శంషాబాద్,జూలై 13(నమస్తే ఉదయం):
రాజేంద్రనగర్ నియోజకవర్గం లో జరిగిన రాజకీయ పరిణామాల అదృష్ట నాయకులు కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దని అందరికీ పార్టీ అధిష్టాన వర్గం అండగా ఉంటుందని శంషాబాద్ తాజా మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ అన్నారు. టిఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా నాయకులు కార్యకర్తలు పార్టీ అభిమానులు అధైర్య పడకుండా గులాబీ జెండా పట్టుకొని ముందుకు సాగాలని శంషాబాద్ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన అనుచరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న సందర్భంగా జరుగుతున్న రాజకీయ పరిణామాలపై శనివారం ఆమె స్పందించారు. రాజేంద్రనగర్ నియోజక వర్గంలో జరుగుతున్న రాజకీయ సమీకరణల దృష్ట్యా పార్టీని నమ్ముకుని ఉన్న నాయకులు కార్యకర్తలు అధైర్య పడవద్దని పార్టీ గత వైభవాన్ని కాపాడుకోవడానికి అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తల వెంబడి తను ఉంటానని పార్టీ అధిష్టానం కూడా మనకు అండగా ఉంటుందని జయమ్మ శ్రీనివాస్ పేర్కొన్నారు. మనం నిరంతరం పోరాడుదాం కలిసికట్టుగా ఉందాం ప్రజలకు అండగా ఉందాం అధిష్టానం మనకు తోడుగా ఉంటుంది. ప్రజా సమస్యలపై పోరాటం చేద్దాం. ప్రజలతో మమేకమై పార్టీని ముందుకు తీసుకు పోదాం అంటూ ఆయన పార్టీ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

తెలంగాణలో పార్టీ గెలుపే లక్ష్యంగా

ప్రజలు పనిచేయాలి

- బిజెపి జాతీయ ముఖ్య ప్రశాసక్ భాస్కర్ సింగ్

రాజేంద్రనగర్, జూలై13(నమస్తే ఉదయం):
కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు పార్టీ శ్రేణులు అందేలా పనిచేస్తూ రాబోయే రోజుల్లో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా పనిచేయాలని బిజెపి జాతీయ ముఖ్య ప్రశాసక్ భాస్కర్ సింగ్ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ ముఖ్య ప్రశాసక్ భాస్కర్ సింగ్ తెలంగాణలో రెండు రోజుల పాటు జరిగే రామ రాజ్య ప్రశాసన్ జాతీయ రాజ్య సభ అఖిల భారతీయ ప్రశాసక్ రాచూరి రాజశేఖర్ అధ్యక్షతన ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ ముఖ్య ప్రశాసక్ భాస్కర్ సింగ్ మాట్లాడుతూ... జాతీయ రాజ్యసభ అనంతరం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రదేశ్ రాజ్యసభ ను నిర్వహించాలని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన రాష్ట్ర ప్రముఖ్ లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంరక్షక్ వై.శ్రీధర్ అయోధ్య ప్రాభారి రవి తివారీ జాతీయ రాజ్ కోశాధికారి శ్రవణ్ సింగ్ ఉత్తర భారత ప్రశాసక్ బాగేశ్ శ్రీవాస్థవ్ వివిధ రాష్ట్రాల ప్రముఖులు శ్రవణ్ సదర్ మహావీర్ దాంగి వికాస్ కీసరి నర్సింగ్ రావు వినోద్ కృష్ణ వీరేందర్, అనసూయ, రాష్ట్ర సంరక్షక్ కొమరయ్య రాష్ట్ర రాజ్ కొష్ సుధాకర్ తదితరలు పాల్గొన్నారు.

భూ వివాదంలో కార్పొరేటర్ భర్త అరెస్ట్

బండ్లగూడ, జూలై13(నమస్తే ఉదయం):

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భూవివాదం కేసులో ఓ కార్పొరేటర్ ను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ కు చెందిన కార్పొరేటర్ నిఖిల భర్త సంగారెడ్డి కి కిస్మత్పూర్ లో పొలం ఉంది. ఈ పొలాన్ని ఓ బిల్డర్ కు అగ్రిమెంట్ చేసిన అనంతరం వివాదం సాగుతోంది. సంగారెడ్డి సోదరునికి చెందిన స్థల విషయమై బిల్డర్ తో వివాదం ఉంది .ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం బిల్డర్ సంగారెడ్డి తో పాటు అతని సోదరుడు అనుచరులు కూల్చివేశారు .ఈ విషయమే బిల్డర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి సంగారెడ్డిని శనివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.క్యాస్ట్రో ను శనివారం మర్యాదపూర్వకంగా ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, కే.చందు యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమానికి గౌడ, గీతన్నలు అధిక సంఖ్యలో తరలిరావాలి.

జిల్లా గౌడ గీత కార్మికుల సంఘం అధ్యక్షులు శ్రీశైలంగౌడ్

మొయినాబాద్ జులై 13 (నమస్తే ఉదయం):

తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్న అబ్దుల్లాపూర్ మెట్ లష్కర్గూడలో జరిగే కార్యక్రమానికి జిల్లాలోని గీతన్నలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేద్దామని జిల్లా గౌడ గీత కార్మికుల సంఘం అధ్యక్షులు శ్రీశైలంగౌడ్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని హిమాయత్ సాగర్ లో ఆయన మాట్లాడుతూ... ఆదివారం (14వ తేదీ ఉదయం 11 గంటలకు) అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్గూడ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి చేతుల మీదుగా గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మేకులు) ఉచితంగా అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని గౌడ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి విచ్చేయడం జరుగుతుందని అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733